క్లుప్తంగా

వరద నీటిలో పడి వ్యక్తి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వరద నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గొల్లపూడిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గొల్లపూడి డీ శ్రీనివాస కల్యాణ్ అట్కిన్సన్ రోడ్డులోని శ్రీ సీతారామ హౌసింగ్ సొసైటీ కాలనీలో నివాసముంటున్నారు. అతను తన పని ముగించుకొని మధ్యాహ్నం సమయంలో వరద నీటిలోనే ఇంటికి తిరిగి వెళ్తున్నాడు. ఇంటికి కాస్తంత దూరంలోనే కుటుంబ సభ్యులు తమ భవనం నుంచి శ్రీనివాసకల్యాణ్ రావటం చూస్తున్నారు. అయితే ఒక్కసారిగా కాలు జారి వరద నీటిలో కింద పడిపోయాడు. శ్రీనివాసకల్యాణ్ తండ్రి దుర్గాప్రసాద్ కుమారుడు పడిపోవటం చూసి హుటాహుటిన అక్కడకు చేరుకున్నాడు. వరద నీటిలో ఉన్న కుమారుడిని పైకి తీసి చూడగా అప్పటికే స్పృహతప్పి ఉన్నాడు. స్థానికుల సాయంతో వైద్యుల వద్దకు తీసుకెళ్లగా మరణించినట్లు ధ్రువీకరించారు.

రోడ్లపై వర్షపు నీటి నిల్వలు వెంటనే తొలగించాలి



పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో రహదారులపై ఉన్న వర్షపు నీటి నిల్వలను సత్వరమే తొలగించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం నోవోటెల్, సి.వి.ఆర్ ఫ్లై ఓవర్, మదర్ థెరిస్సా జంక్షన్, మొగల్రాజపురం, ఫకీర్ గూడెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న వర్షపు నీటిని పరిశీలించి ఎయిర్ టెక్ మిషన్స్‌తో త్వరితగతిన తొలగించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని చెప్పారు. కార్పొరేషన్ వాహనాలే కాకుండా అదనపు వాహనాలను కూడా ఏర్పాటు చేసి త్వరితగతిన రోడ్డు మీద నిల్వ ఉన్న వర్షపు నీటి నిల్వలను పూర్తిగా తొలగించాలని కమిషనర్ ఆదేశించారు.

పునరావాస కేంద్రాల్లో వసతులు కల్పించాలి

పటమట(విజయవాడతూర్పు): వరద వల్ల దెబ్బతిన్న ప్రాంతాల ప్రజలకు పునరావాస కేంద్రాలు పెంచి దాదాపు లక్ష మందికి ఆహారం కల్పించామని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. ప్రస్తుతం పునరావాస కేంద్రాల్లో 1000 మందికి పైగా భోజన సదుపాయాలు, తాగునీరు, పాలు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర అవసరమైన పదార్థాలు అందుబాటులో ఉన్నాయని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు సరైన సురక్షితం భోజనాన్ని అందిస్తున్నామన్నారు. కేవలం పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలకు మాత్రమే కాకుండా ఇళ్ల దగ్గర చిక్కుకున్న వారికి కూడా భోజనాలను వారి ఇంటి వద్దకే పంపిస్తూ అందరికీ భోజన ఏర్పాట్లు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముంపు ప్రాంతంలో చిక్కుకున్నవారు భయభ్రాంతులకు గురికాకుండా విజయవాడ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 0866–2424172, 2427485, 81819 60909 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

వీఎంసీ ఆధ్వర్యంలో 12 సహాయక శిబిరాల ఏర్పాటు

పటమట(విజయవాడతూర్పు): నగరాన్ని వరద ముంచెత్తటంతో విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మూడు సర్కిళ్ల పరిధిలో 12 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసింది. సర్కిల్–1 పరిధిలో విద్యాధరపురం లేబర్ కాలనీలోని కల్యాణమండపం, సంపర తాతబ్బాయి కల్యాణమండపం, సర్కిల్–2 పరిధిలో ప్రజాశక్తి నగర్ కల్యాణమండపం, లగడపాటి రాజగోపాల్ కల్యాణమండపం, కండ్రిక సుభాష్ చంద్రబోస్ నగర్ కమ్యూనిటీ హాలు, బుడమేరు మధ్యకట్ట ప్రాంతంలో తమ్మినేని వెంకటరావు స్కూల్, న్యూ ఆర్ఆర్‌పేటలోని కేర్ అండ్ షేర్ స్కూల్, సుందరయ్యనగర్‌లోని కాపు కల్యాణ మండపాల్లో శిబిరాలను ఏర్పాటు చేశారు. సర్కిల్–3 పరిధిలోని దర్శిపేట మున్సిపల్ హైస్కూల్, సిద్ధం కృష్ణారెడ్డి ఓడీఏ కమ్యూనిటీ హాలు, కృష్ణలంక రాణిగారితోట రామాలయం వద్ద ఉన్న న్యూ కమ్యూనిటీ హాల్‌లో వరద సహాయక శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల ముంపు బాధితులు తమకు అందుబాటులో ఉన్న వీఎంసీ సహాయక శిబిరాలకు రావాలని వీఎంసీ అధికారులు కోరుతున్నారు.

4 నుంచి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలు

విజయవాడ కల్చరల్: కృష్ణమాచార్యులు కళాపీఠం ఆధ్వర్యంలో 4వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు సంగీత విద్వాంసుడు ఎస్‌సీహెచ్ కృష్ణమాచార్యులు శత జయంతి ముగింపు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి ఎస్‌సీహెచ్ బుచ్చయ్య చార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో నిర్వహించే కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు కచేరీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 4వ తేదీ రాత్రి 7 గంటలకు బహుభాషా పండితుడు డాక్టర్ వారణాసి శివరామకృష్ణకు కృష్ణమాచార్యులు స్మారక పురస్కారం ప్రదానం చేయడం జరుగుతుందని తెలిపారు.

నిండా ముంచిన బుడమేరు

- బిక్కుబిక్కుమంటున్న ప్రజానీకం
- పశ్చిమ నియోజకవర్గంలో వరద బీభత్సం
- 12 డివిజన్లను ముంచెత్తిన బుడమేరు వరద
- రెండున్నర దశాబ్దాల్లో రాని వరద ఒక్కసారిగా పెరిగిన ఉధృతి
- సాయం అందక అల్లాడుతున్న ప్రజలు
- ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉన్న ప్రజలు



భవానీపురం స్వాతి థియేటర్ నుంచి చర్చి సెంటర్‌కు వెళ్లే రహదారిలో భారీగా నిలిచిన వరదనీరు



చెరువును తలపిస్తున్న చర్చి సెంటర్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద పశ్చిమ నియోజకవర్గాన్ని నిండా ముంచింది. నియోజకవర్గంలోని ప్రజానీకం బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. శనివారం రాత్రి నుంచి ఒక్కసారిగా బుడమేరు పశ్చిమ నియోజకవర్గంపై పగడ విప్పింది. బుడమేరు తన విస్తృత ప్రవాహంతో నియోజకవర్గంలోని సగానికిపైగా ఉన్న డివిజన్లను నీట ముంచింది. తొలుత నియోజకవర్గ శివారు ప్రాంతాలే అనుకున్నా క్రమేణా వరద నీరు నగరంలోకి భారీగా చొచ్చుకురావటంతో ఆయా ప్రాంతాలన్నీ మునిగిపోయాయి. నియోజకవర్గంలోని ఒకటి కాదు రెండు కాదు సుమారు ఏడెనిమిది అడుగులు దాటి వరద నీరు పలు డివిజన్లలో ప్రవహిస్తుంది. అధికారుల అరకొర సాయంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తున్నారు.

12 డివిజన్లను ముంచెత్తిన వరద

పశ్చిమ నియోజకవర్గంలో మొత్తం 22 డివిజన్లు ఉన్నాయి. అందులో సుమారు 12 డివిజన్లను పూర్తిగా వరద నీరు ముంచేసింది. గట్టువెనుక ప్రాంతాలైన ఊర్మిళానగర్, ఏకలవ్యనగర్, కబేళా, విద్యాధరపురం, భవానీపురం, లేబర్‌కాలనీ, కామకోటి నగర్‌తో పాటు లంబాడీపేట, కేఎల్ రావు నగర్, పాలప్రాజెక్ట్ తదితర ప్రాంతాలన్ని భారీ వరద నీటితో మునిగిపోయాయి. అలాగే పాతరాజరాజేశ్వరిపేట, నైజాంగేట్, వించిపేట తదితర ప్రాంతాల్లో వరదనీరు భారీగా నిలిచిపోవటంతో ఇళ్ల నుంచి జనం బయటకు వచ్చే పరిస్థితులు లేకుండా పోయాయి.



పాత రాజరాజేశ్వరిపేటలో ఇంటిలోకి చేరిన వరద నీరు

అధికారుల వైఫల్యంతోనే వరద బీభత్సం..



గట్టువెనుక ప్రాంతంలో పర్యటిస్తున్న షేక్ ఆసిఫ్, పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేర వరద పరిస్థితులకు అధికారుల వైఫల్యమే కారణమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్ ఆరోపించారు. బుడమేర వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆసిఫ్, పార్టీ నేత పోతిన మహేష్‌లు పర్యటించారు. అక్కడి పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. ఆసిఫ్ మాట్లాడుతూ బుడమేరు నీరు నగరం వైపు వస్తుందని అధికారులకు ఉందన్నారు. అయితే ఎంత నీరు వస్తుందనే అంశాన్ని గమనించకపోవటం, దానిపై శ్రద్ధ పెట్టకపోవటంతో ఈ విధమైన పరిస్థితులు వచ్చాయని చెప్పారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాల్లోను ప్రజలను అప్రమత్తం చేయటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అంతేకాకుండా ప్రజలు నీటిలో అల్లాడిపోతున్నారని, వారికి అవసరమైన ఆహారం ఇతర సదుపాయాలను కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.

బుడమేరు ఉగ్రరూపం..

సుమారు రెండున్నర దశాబ్దాల్లో రాని బుడమేరు వరద ఒక్కసారిగా నియోజకవర్గాన్ని ముంచెత్తింది. సాధారణంగా 2000 సంవత్సరం వరకూ బుడమేరు వరద నియోజకవర్గాన్ని ముంచెత్తుతూ ఉండేది. ఆ తరువాత వచ్చిన దివంగత మహానేత రాజశేఖరరెడ్డి ప్రభుత్వం బుడమేరు వరదకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టారు. నాటి నుంచి వరద నీరు రాకుండా ఉంది. అయితే ప్రస్తుతం వచ్చిన భారీ వర్షాలకు ఒక్కసారిగా బుడమేరు ఉగ్రరూపాన్ని దాల్చింది. బుడమేరు రాకతో గతంలో మునిగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలతో పాటుగా మరికొన్ని కొత్త ప్రాంతాలను సైతం ఈ సారి బుడమేరు వరద ముంచెత్తింది.

పంజా సెంటర్‌కు చేరిన వరద నీరు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద నీరు ఆదివారం రాత్రి వించిపేట మీదుగా పంజా సెంటర్ వరకు చేరుకుంది. వించిపేటలోని నైజాం గేట్ సమీపంలో ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ల ద్వారా వించిపేటలోకి ప్రవేశించిన వరద నీరు స్థానికంగా కొన్ని ప్రాంతాలకు పరిమితమైంది. అయితే రాత్రికి పంజా సెంటర్, కొత్తపేట వరకూ వరద నీరు చేరుకుంది. అలాగే కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్ సమీపంలోని డ్రెయిన్ల నుంచి రోడ్డుపైకి నీరు రావటంతో స్థానికులు అలర్ట్ అయ్యారు.

నీటిలోనే వించిపేట

వించిపేట(విజయవాడపశ్చిమ): వించిపేట కొండ ప్రాంత ప్రజలు బిక్కు బిక్కుమంటూ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని జీవిస్తున్నారు. ఇప్పటికే గొల్లపాలెంగట్టు, టైలర్‌పేట, సీఎస్ఐ చర్చి కొండ ప్రాంతాలలో పలు చోట్ల రిటైనింగ్ వాల్స్ కుంగిపోయి మట్టి, రాళ్లు కింది నివాసాలపై పడుతున్న ఘటనలు జరిగాయి. అందులో ఆస్తి నష్టం మినహా ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఆకలితో అలమటిస్తున్న ప్రజలు

పాత రాజరాజేశ్వరిపేట, వించిపేట, నైజాంగేటుసెంటర్, సీఎస్ఐ చర్చి తదితర ప్రాంతాలలో ఐదు నుంచి ఏడు అడుగుల మేర నీరు రోడ్లపై చేరటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాగునీరు, నిత్యావసరాలు తెచ్చుకునే అవకాశం కూడా లేకపోవడంతో పిల్లలతో ఇబ్బందులు పడుతున్నామంటు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్నామని ప్రజలు వాపోతున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్లలో నివాసితుల ఇళ్లలోకి నీరు భారీగా చేరటంతో ఇంట్లోని గృహోపకరణాలు, నిత్యావసరాలు నీట మునిగి ఉపయోగం లేకుండా పోయాయని వాపోతున్నారు. కొంత మంది ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో తలదాచుకోగా కొందరు నివాసితులు ఎత్తైన భవనాలపైకి చేరి సహాయం కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు చేరుకున్నారు.

నీట మునిగిన గట్టువెనుక ప్రాంతం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గట్టు వెనుక ప్రాంతాన్ని బుడమేరు వరదనీటితో కబళించింది. ఒక్కసారిగా వరదనీరు ముంచెత్తడంతో స్థానిక ప్రజానీకం భయందోళనకు గురవుతున్నారు. వరదనీరు అంతకంతకు పెరుగుతుండటంతో స్థానిక ప్రజానీకం భయంగుప్పిట్లో కాలం గడుపుతున్నారు. భవానీపురం, విద్యాధరపురం, రామరాజ్యనగర్, ఊర్మిళానగర్ పరిధుల్లోనూ అన్ని ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. ఆర్టీసీ వర్క్‌షాప్ ప్రాంగణం మొత్తం నీట మునిగింది. అలాగే పున్నమి హోటల్ ప్రాంగణాన్ని సైతం వరదనీరు పోటెత్తింది. అదేవిధంగా ఆర్టీసీ వర్క్‌షాప్‌రోడ్డు, స్వాతిరోడ్డు, అట్కిన్సన్‌రోడ్డు ప్రాంతాలు సైతం భారీగా వర్షపునీరు చేరటంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజానీకం అల్లాడిపోతున్నారు.

రూ.కోట్లలో నష్టం

ప్రధానంగా చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో పరిస్థితులు మరింత దారుణంగా తయారయ్యాయి. ఇంటి బయటకు రావటానికి వీలు లేకుండా వర్షపునీరు, లోపలు విద్యుత్ నిలిపివేత తదితర పరిస్థితుల్లో ప్రజానీకం నానా ఇబ్బందులు పడుతున్నారు. శుక్ర, శనివారాలు కురిసిన వర్షపునీరు పూర్తిగా వెళ్లిపోయినా ఆదివారం ఉదయానికి బుడమేర వరద నీరు ముంచెత్తడంతో ప్రజానీకం ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి.



నీటిలో వైఎస్సార్ కాలనీ



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి



సీఎస్ఐ చర్చి రోడ్డులో స్థానికుల ఇబ్బందులు

సుమారు మూడు రోజులుగా పూర్తిగా వర్షపునీటిలోనే ఉండటంతో చిన్నారులు, వృద్ధుల పరిస్థితులు దారుణంగా మారింది. అలాగే అధికార యంత్రాంగం నుంచి పూర్తిస్థాయిలో సాయం అందకపోవటంతో మా పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఇళ్లలో గృహోపకరణాలతో సామాన్యులతో పాటు వివిధ వ్యాపారస్తులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది.

అంధకారం.. మూగబోతున్న ఫోన్లు

బుడమేరు వరద తాకిడికి మునిగిపోయిన ప్రాంతాల్లో సాయం అందక ప్రజానీకం అల్లాడిపోతుంది. ప్రధానంగా నగర శివారు ప్రాంతాల్లో సుమారు 10 అడుగుల మేర వరద నీరు ఉండటంతో పై అంతస్తులకు వెళ్లి తలదాచుకుంటున్నారు. అయితే చాలా ప్రాంతాల్లో వారికి విద్యుత్ సదుపాయం నిలిచిపోవటంతో సమాచారం చేరవేత జరగక ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం రాత్రి చాలా ప్రాంతాలు అంధకారం నెలకొంది. సెల్‌ఫోన్ల చార్జింగ్ లేకపోవటంతో వారి బాధను బయటకు వెళ్లగక్కే పరిస్థితులు కూడా లేకుండా పోయాయి. ఫోన్లు మూగబోయాయి. నగరపాలకసంస్థ నుంచి గానీ ఇతర ప్రభుత్వ శాఖల నుంచి గాని పూర్తి స్థాయిలో ఆహార పంపిణీ జరగకపోవటంతో ఆకలితో అలమటిస్తున్నారు. అంతేకాకుండా వారి మంచిచెడులను చూసే వారు లేకుండా పోయారంటూ వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది తమను కాపాడాలంటూ తమకు తెలిసిన వారికి అందుబాటులో ఉన్న ఫోన్ల ద్వారా మెసేజ్‌లు పెట్టిస్తున్నారు.



నీట మునిగిన పున్నమి ఘాట్ ప్రాంగణం



వర్షపు నీటిలో ఆర్టీసీ వర్క్‌షాప్



టైలర్‌పేట కొండ ప్రాంతంలో పడిన కొండ చరియలు



ఐరన్‌యార్డ్‌ను ముంచెత్తిన వరదనీరు

రవాణా అదనపు కమిషనర్ ప్రసాదరావుకు సత్కారం



శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రసాదరావు తదితరులు

పటమట(విజయవాడతూర్పు): రవాణా శాఖ అదనపు కమిషనర్ ఎస్.ఏ.వీ. ప్రసాదరావు రవాణా శాఖ పట్ల ప్రజల్లో నెలకొన్న దురభిప్రాయాన్ని తన నిజాయతీతో ఉత్తమ అధికారిగా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ధైర్యశాలిగా ఎంతో గుర్తింపు తెచ్చుకున్నారని వక్తలు ప్రశంసించారు. అదనపు రవాణా కమిషనర్ ప్రసాదరావు ఉద్యోగ విరమణ అభినందన సభను ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్, ది ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఆదివారం సాయంత్రం విజయవాడలోని కేడీఎల్ఓఏ హాల్‌లో నిర్వహించాయి.

రవాణా శాఖ ప్రక్షాళన..

ఈ సందర్భంగా ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోపాల్ నాయుడు మాట్లాడుతూ ప్రసాదరావు మాదిరిగా నీతినిజాయతీలుండే ఉన్నతాధికారులు నానాటికీ కనుమరుగవుతున్నారన్నారు. రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు మాట్లాడుతూ.. కేరళలో మాదిరిగా ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ప్రసాదరావు సేవలను ప్రభుత్వం వేరే రూపేణా వినియోగించుకోవాలని కోరారు. కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా మాట్లాడుతూ.. ప్రసాదరావు రవాణాశాఖను ప్రక్షాళన చేయడానికి ఐ.ఐ.ఎస్. ఉద్యోగాన్ని వదిలి రవాణా అధికారిగా చేరిన నాటి నుంచి గత 34 ఏళ్ల సరీ్వసులో తనదైన పనితనం చూపారన్నారు. ట్రాన్స్‌పోర్టు జాయింట్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ సీఈఓ నారాయణరావు, కృష్ణాడిస్ట్రిక్ట్ లారీఓనర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు రావి గోపాలరావు, కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ మ్యూచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ కోనేరు వెంకట రమేష్ తదితరులు ప్రసాదరావును ఘనంగా సత్కరించారు. తన విశ్రాంత జీవితాన్ని పుస్తక పఠనం, సంగీత సాధనతో సుసంపన్నం చేసుకుంటానని ప్రసాదరావు తెలియజేశారు. ఈ సందర్భంగా అంపాపురం మోడల్ డ్రైవింగ్ స్కూలులో 32 రోజులపాటు హెవీ వెహికిల్ డ్రైవింగ్ శిక్షణ పూర్తి చేసిన ట్రైనీలకు ప్రసాదరావు సంబంధిత సర్టిఫికెట్లు అందజేశారు.

● 5వ కృతి రత్నావణి పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో 5వ తేదీ గురువారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదిక మీద మంచాల జగన్నాథరావు సంకలన పరచిన కృతి రత్నావణి 5వ భాగం ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్ ఆదివారం తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో అనంతపురానికి చెందిన రాజేశ్వరి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి చిన్నారులను అభినందించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపు బాధితులకు ఆదివారం ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర కమిటీ ఆధ్వర్యాన ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ఆహార పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము విపత్కర పరిస్థితుల్లో తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వరద ముంపు బాధితులకు అండగా నిలవడంతోపాటు వెయ్యిమందికి ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే బుడమేరు మధ్యకట్టలో ముంపు బాధితులకు శ్రీశ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం ఆలయ కమిటీ ధర్మకర్త చింతపల్లి కనకారావు ఆధ్వర్యాన రెండు వేల మందికి వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. వరద ముంపు బాధితులకు తమ వంతు బాధ్యతగా ఆహారం అందజేస్తున్నామని పేర్కొన్నారు.